క్లుప్తంగా

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సరుబుజ్జిలి: పంటలను ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు జె.జగన్నాథం, జి.చిట్టిబాబు సూచించారు. మండల కేంద్రంలో నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులతో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. తెగుళ్లు, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు షమీమ్, త్రివేణి, రిచిత, రాజేశ్వరి, గ్రామవలంటీర్ గదిలి మహేష్ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

సరుబుజ్జిలి: పశువులకు షెడ్యూల్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు సీహెచ్ సుబ్రహ్మణ్యం అన్నారు. బురిడివలస గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణా టీకాలను శనివారం వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డి.సతీష్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

పాతపట్నం ఇన్‌చార్జి ఏవోగా శిరీషా



పాతపట్నం: పాతపట్నం మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా కె.శిరీషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నరసన్నపేట ఏడీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కింజరాపు రవికుమార్ ఉన్నత చదువుల కోసం వెళ్లారు.

హైదరాబాద్ వెళ్లి.. పింఛన్ అందజేసి..


కృష్ణమ్మకు పింఛన్ అంజేస్తున్న వలంటీర్ విష్ణు

బూర్జ: నీలాదేవిపేట గ్రామానికి చెందిన వలంటీర్ జర్జాన విష్ణు ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన కాకల కృష్ణమ్మ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని కుమారుడు ఇంటి వద్ద ఉంటున్నారు. ఈమెకు మంజూరైన వృద్ధాప్య పింఛన్ మొత్తాన్ని అక్కడకు వెళ్లి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. వలంటీర్ విష్ణును గ్రామస్తులు అభినందించారు,

పీహెచ్‌సీ వైద్యాధికారిపై విచారణ


విచారణ చేస్తున్న డీఐవో కుమార్

హిరమండలం: హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిగీతికపై ఉన్నతాధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఈమె సక్రమంగా విధులు నిర్వహించడంలేదని, పలు వివాదాలకు తావిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు ఇటీవల గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఐవో ఆర్.వి.ఎస్.కుమార్ పీహెచ్‌సీలో విచారణ చెపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యురాలితోపాటు ఫిర్యాదుదారులను విచారించినట్లు డీఐవో చెప్పారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాతపట్నం: రోంపివలస గ్రామానికి చెందిన తోటాడ చిన్నారావుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని నోటీసులు ఇవ్వకుండా ఓ ఫైనాన్స్ సంస్థకు చెందిన ముగ్గురు వ్యక్తులు తీసుకెళ్లిపోయారు. దీనిపై చిన్నారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫైనాన్స్ సంస్థకు చెందిన రవీంద్ర, భాస్కర్, సురేష్‌లపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎస్.కామేశ్వరరావు శనివారం తెలిపారు.

26 ఒడిశా మద్యం బాటిళ్ల స్వాధీనం

పాతపట్నం: ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తుండగా పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీల్లో బూరగాం గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం పట్టుబడ్డాడు. అతని నుంచి 26 ఒడిశా మద్యం బ్యాటిళ్లను స్వాధీనం చేసుకుని.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై కామేశ్వరరావు తెలిపారు.

సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు


పొందూరు: సమావేశంలో మాట్లాడుతున్న రఘురాజు

పొందూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కృషి చేయాలని శాసనమండలి సభ్యుడు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఇందుకూరి రఘురాజు పిలుపునిచ్చారు. పొందూరులోని ఓ కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణ ప్రణాళికపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వని వేరే పట్టభద్రులతో కనీసం రెండో ప్రాధాన్యత ఓటునైనా వేయించేలా చూడాలన్నారు. మేధావుల ఎన్నికలు కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. మండలాల్లో జరిగే సమావేశాలకు నాయకులు, అభిమానులను విధిగా పిలవాలన్నారు. శతశాతం పోలింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు. ఎక్కువ మంది పట్టభద్రులున్న కుటుంబాలను, వలస పట్టభద్రులను గుర్తించి వారితో ఓటు వేయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ మాట్లాడుతూ.. విశాఖ రాజధాని కావాలంటే సుధాకర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే విశాఖ రాజధాని సాధ్యమన్నారు. దేశంలోనే అత్యంత ముఖ్యులైన పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలను పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఆమదాలవలసలోని ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో ఈనెల ఏడో తేదీన నియోజకవర్గంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలతో సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, నాయకులు బాడాన క్రిష్ణ, ప్రతాప్, కిల్లి నాగేశ్వరరావు, గుడ్ల మోహన్, వండాన వెంకటరావు పాల్గొన్నారు.


సారవకోట: అక్కివలసలో ప్రచారం చేస్తున్న నాయకులు


పాతపట్నం: బోరుభద్రలో పట్టభద్రులకు కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం

సారవకోట: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సచివాలయ మండల కన్వీనర్ తులసీదాస్ గుమ్మపాడు, గోపాలపురం, అక్కివలస గ్రామాలలో, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ కొండాల దేవేంద్ర, పెద్దలంబ సర్పంచ్ ఇసై షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ గొర్లె ఢిల్లీరావులు పెద్దలంబ, మూగుపురం, గోవర్ధనపురం గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పాతపట్నం: సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎనుగుతల సూర్యం, మద్దు తాతయ్య, గోకవలస రాము పిలుపు నిచ్చారు. బోరుభద్ర, సీతారాంపల్లి గ్రామాల్లోని పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓటును అభ్యర్థించారు. నాయకులు చీకటి పద్మరాజు, సవిరిగాన శ్రీనివాసరావు, ధర్మాన కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమదాలవలస రూరల్: సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. బొబ్బిలిపేట, కట్యాచార్యులపేట, తురకపేట పంచాయతీల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి సుధాకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా ఓటర్లకు పోలింగ్ బూత్ నంబర్‌తో పాటు పూర్తి వివరాలు కలిగిన కరపత్రాలను అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు, పార్టీ నాయకులు గురుగుబెల్లి చంద్రయ్య, మామిడి డిల్లేశ్వరరావు, అంబటి సత్యన్నారాయణ ఉన్నారు.

పొందూరు: సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ కోరారు. మలకాం గ్రామంలో పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి సుధాకర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. నాయకులు అప్పలనాయుడు, వెంకటరావు ఉన్నారు.

నరసన్నపేట: మడపాం, పోతయ్యవలస, చెన్నాపురం, ఉర్లాం గ్రామాల్లో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నాయకులు బార్ల వేణుగోపాలరావు, అప్పన్న కోరారు.


పొందూరు: మలకాంలో ప్రచారం చేస్తున్న సువ్వారి గాంధీ


నరసన్నపేట: పోతయ్యవలసలో ప్రచారం చేస్తున్న నాయకులు


ఆమదాలవలస రూరల్: ప్రచారం చేస్తున్న శ్రీరామ్మూర్తి తదితరులు

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి విశాఖలోని ఓ హోటల్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఉన్నారు. –ఎల్.ఎన్.పేట

విద్యార్థులకు టెన్త్ కీలకం


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: విద్యార్థులకు పదో తరగతిలో వచ్చిన మార్కులే కీలకమని రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జె.కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన టెన్త్ విద్యార్థుల వీడ్కోలుసభ, పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులకు స్థానికంగా నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ మార్కులు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ వెల్లడించారు. వారిని రోటరీ క్లబ్ ద్వారా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, ఉపాధ్యాయులు చింతాడ వెంకటరమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అభియోగాలపై డీఎల్‌పీవో విచారణ


వార్డు సభ్యులను విచారిస్తున్న డీఎల్‌పీవో ప్రకాశరావు

పొందూరు: పొందూరు మేజర్ పంచాయతీపై వచ్చిన ఫిర్యాదులు, అభియోగాలపై కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి సూచనల మేరకు శ్రీకాకుళం డీఎల్‌పీవో పి.ప్రకాశరావు శనివారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీకి చెందిన ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ తీర్మానం లేకుండా విక్రయించారని, ఆర్థిక లావాదేవీల విషయంలో అవకతవకలు జరిగినట్లు కొద్దిరోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు స్థానికులు కొంతమంది ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణలో భాగంగా రికార్డులను పరిశీలించారు. పాలకవర్గ సమావేశంలో చర్చించిన అంశాలకంటే మినిట్ బుక్‌లో ఎక్కువ తీర్మానాలు పొందిపరిచినట్లు గుర్తించినట్టు డీఎల్‌పీవో చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసినట్లు గుర్తించామని.. ఇంకా పూర్తిస్థాయి విచారణ జరపాల్సి ఉందన్నారు. ప్రస్తుతం విచారణ జరిపిన అంశాలపై నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. డీఎల్‌పీవోతో పాటు ఎంపీడీవో కార్యాలయం పరిపాలనాధికారి మురళీ ఉన్నారు.

మహిళలకు జీవనోపాధులపై శిక్షణ


మాట్లాడుతున్న నాబార్డు జీఎం ఎన్.ఎస్.మూర్తి

బూర్జ: మహిళలు జీవనోపాధులు పెంపొందించుకోవాలని నాబార్డు జనరల్ మేనేజర్ ఎన్.ఎస్.మూర్తి అన్నారు. జీవనోపాధులు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తేనెటీగల పెంపకంపై మహిళలకు గోపిదేవిపేటలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. నాబార్డు డీడీఎం టి.నాగార్జున మాట్లాడుతూ.. శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రిసోర్సుపర్సన్ కాంతారావు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మన్యం సహజ కంపెనీ సీఈవో బి.శంకరరావు, ఎఫ్‌పీవోలు రవి, గణేష్, ఆర్సు సిబ్బంది పాల్గొన్నారు.

జలసంరక్షణ అందిరి బాధ్యత



మాట్లాడుతున్న ఉదయభాస్కర్

నరసన్నపేట: జల సంరక్షణ అందరి బాధ్యతని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఉదయభాస్కర్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సౌజన్యంతో గడ్డయ్యపేట వద్ద జాతీయ జలసంరక్షణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ తరహాలో నీటి సంరక్షణ కూడా మహా ఉద్యమంలా సాగాలని.. అప్పుడే భవిష్యత్ తరాలకు నీటి వనరులు లభిస్తాయన్నారు. ఇష్టానుసారంగా నీటిని వినియోగించడం వల్ల ముందుముందు అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. విద్యార్థు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవో రవికుమార్, ఎన్‌వైకే ప్రతినిధి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

‘ఉద్యోగులపట్ల సానుకూలంగా వ్యవహరించాలి’


కమిషనర్‌కు కరపత్రాన్ని అందజేస్తున్న కృష్ణమోహన్

ఆమదాలవలస: ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని ఏపీ మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.కృష్ణమోహన్ కోరారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఏపీ జేఏసీ ఇచ్చిన కార్యాచరణపై చర్చించేందుకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడుని కలిసి మద్దతు కోరారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. మున్సిపల్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ డి.రామారావు, టీపీఎస్ హెచ్.వి.సత్యన్నారాయణ, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ


మానవహారం చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: భూసారం పెంచే పలురకాలైన విత్తనాలతో తొలకరికి ముందే భూసారాన్ని పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహనలో భాగంగా కొసమాలలో శనివారం ర్యాలీ చేశారు. అనంతరం ప్రధాన జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. యూరియాకు దూరంగా ఉండాలని, మనం నిత్యం వాడుతున్న కూరగాయాల వ్యర్థాలు, ఆకుకూరలు, పచ్చిరొట్ట, చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పప్పుదినుసులు ఇలా 33 రకాల విత్తనాలను పొలాలలో చల్లడం వలన భూసారం పెరుగుతోందన్నారు. దీనివలన రసాయనిక ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా..నిత్యం పంటలకు అనువుగా భూమి తయారవుతుందన్నారు. వీపీఏ యమున, పీఆర్‌పీ లక్ష్మీకాంతం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

కొత్తూరు: దిమిలి గ్రామానికి చెందిన బెలమల ధర్మారావును సారా తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్సై ఎం.గోవిందరావు శనివారం తెలిపారు. ఈయన నుంచి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని.. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

భక్తి శ్రద్ధలతో దానప్పతల్లి సంబరం


పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నరసన్నపేట: జల్లువానిపేటలో దానప్పతల్లి సంబరాలు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జల్లు అప్పలనాయుడు, తిరుపతిరావుల ఇంటముగింట ఉన్న దానప్ప తల్లి విగ్రహాలకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న పుట్ట వద్దకు డప్పులు, బాజా భజంత్రీలతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీగా వస్తున్న సంబరాలు మూడేళ్లుగా కోవిడ్ నేపథ్యంలో నిర్వహించలేదు. ఈ ఏడాది ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో సంబరాన్ని ఘనంగా జరుపుకున్నారు.

నిందితులను శిక్షించాలి

బూర్జ: నీలాదేవిపేట గ్రామానికి చెందిన జమ్మాన సుదర్శనరావును హత్య చేసిన నిందితులను శిక్షించాలని సమతా సైనిక్ దళ్ జిల్లా కమిటీ నాయకులు కోరారు. సుదర్శన రావు కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. నాయకులు అదపాక గౌరినాయుడు, ఇల్లాకుల సూర్యప్రకాష్, సూర రామారావు తదితరులున్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు


సారవకోట: మాట్లాడుతున్న తేజ చక్రవర్తి



మెళియాపుట్టి: మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిత

ఆమదాలవలస రూరల్: మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలవుతున్నాయని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికి హక్కులు, బాధ్యతలు ఉంటావని.. వాటిని కాపాడుకోవాలన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. క్షణికావేశానికి గురికాకుండా శాంతితో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం పైడి కూర్మారావు, ప్రభుత్వ న్యాయవాది సీపాన గోవింద రావు, సీనియర్ న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కొత్తూరు: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీవో టి.త్రినాథమ్మ అధ్యక్షతన న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వరకట్నం, బాల్యవివాహాలు, మనోవర్తి, దిశ, గృహనిర్బంధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్టు సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 10988కు తెలియజేయాలన్నారు. మండల లీగల్ కమిటీని ఎంపిక చేసినట్టు అప్పారావు చెప్పారు. సమావేశంలో బార్ అసోసియేషన్ సభ్యులు రాడ రాజు, సీహెచ్ రవికిరణ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

పొందూరు: మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని పొందూరు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం చైర్మన్ పీఎస్‌వీవీ కృష్ణసాయితేజ అన్నారు. కోర్టు ఆవరణలో సచివాలయాల మహిళా పోలీసులతో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికా సంరక్షణ, దంపతుల మధ్య తగాదాల పరిష్కారంపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు కె.రమణమూర్తి, కె.రఘుబాబా, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళాశక్తి ప్రపంచాన్ని నడిపించాలి

పాతపట్నం: మహిళలు అన్నిరంగాల్లో దూసుకుపోతున్న తరుణంలో వారే ప్రపంచాన్ని నడిపించే స్థాయికి ఎదగాలని టెక్కలి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, పాతపట్నం కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి మల్ల అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లా న్యాయసేవా సంస్థల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని.. ఇది ఎంతో శుభసూచకమన్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు శాసించే స్థాయిలో ఉన్నారన్నారు. జాతీయ రిసోర్స్ పర్సన్స్ డి.విజయలక్ష్మి, డి.సరల కుమారిలు మహిళలకు సంబంధించిన చట్టాలను తెలియజేశారు. ఏపీపీ జి.ప్రియదర్శిని, ఎస్సై ఎస్.కామేశ్వరరావు, ఏపీఎం పి.మనోరత్నం, న్యాయవాదులు బి.ఈ.సత్యనారాయణ, జి.ఫాల్గుణరావు, ఎం.రమణ, వైద్యులు జి.అనిత, చిన్నంనాయుడు, మండల న్యాయ సేవా సంఘం, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


ఆమదాలవలస రూరల్: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

సంప్రదాయాన్ని పాటించాలి

మెళియాపుట్టి: భారతదేశ సంప్రదాయం ప్రకారం విద్యార్థినుల కట్టూ, బొట్టు ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత అన్నారు. మండల కేంద్రంలోని దుక్కరాజన్న రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జాడుపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిచయంలేని వ్యక్తులతో మాట్లాడటం, తిరగటం చేయరాదన్నారు. న్యాయమూర్తుల జిల్లా అధ్యక్షులు ఎస్.ధర్మరాజు, ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఎస్సై రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు ఉన్నారు.

నేరస్తుల్లో పరివర్తన తీసుకురావాలి

సారవకోట: నేరస్తుల్లో పరివర్తన తీసుకు రావడమే న్యాయవ్యవస్థ లక్ష్యమని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి తేజ చక్రవర్తి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. చట్టానికి లోబడి శిక్షలు విధించబడతాయన్నారు. శిక్ష అమలు చేయడంలో ప్రధాన ఉద్దేశం నేరం చేసిన వారిలో పరివర్తన తీసుకు రావడమేనన్నారు. గ్రామాల్లో నేరాలు జరగకుండా మహిళా పోలీసులు తగిన పాత్ర పోషించాలన్నారు. ఎస్సై అప్పారావు, న్యాయవాదులు డీఈ సత్యన్నారాయణ, పీఈ సత్యన్నారాయణ పాల్గొన్నారు.